# "తప్పులెన్నువారు..."

—పి. బి. నారాయణ

ఆ వూళ్ళో రౌడీ అందరికీ పరిచయమయిన సందు అది.

ఆ సందు ముందు నిలబడి ఒకసారి అటూ యిటూ చూసింది జానకి.

సాయంకాలం ఆరయింది. కొద్దిగా రష్‌గానే వుంది అక్కడ. చాలా మంది వస్తూ పోతూ వున్నారు.

నెమ్మదిగా ఆ సందులోకి అడుగు పెట్టింది జానకి.

కొద్దిగా ఇరుకుగా వుందా సందు రోడ్డు నిండా నానా చెత్తా వుంది. రోడ్డులో సన్నగా మురికి కాలువ ఆక్రమించింది. దాని మీద నుంచి దుర్వాసన వస్తోంది.

రుమాలుతో ముక్కు మూసుకుంది. జానకి వాసన భరించలేక నెమ్మదిగా నడవడం ప్రారంభించింది. భారతదేశ దౌర్భాగ్యమంతా ఆ సందుల్లోనే వుంది.

వీధి ప్రక్కన ఇరుకుగా ఒకదాని ప్రక్కన ఒకటి, ఒకదాని నెత్తిన ఒకటిగా, కట్టబడిన ఇళ్ళు చిన్న అక్క పిడతల్లా వున్నాయి.

తలుపులకి ఆనుకుని వచ్చేపోయేవారికేసి ఆశగా చూస్తున్నారు శరీరం అమ్ముకునేవాళ్లు. వెళ్ళే వాళ్ళు ఆ ఇళ్ళల్లోకి వెళ్తున్నారు. వచ్చేవాళ్ళు వస్తున్నారు.

నెమ్మదిగా నడుస్తోంది.

హఠాత్తుగా జానకి చూపులు ఒకచోట ఆగిపోయాయి.

"సు....శీ....ల" అప్రయత్నంగా వెలువడ్డాయి జానకి నోటినుంచి.

అనుమానం ...

ఇంకోసారి కళ్ళు నులుముకుని చూసింది జానకి.

సందేహం లేదు.

సుశీలే!

సుశీల నిలబడి వున్న వేపు వేగంగా నడిచింది జానకి.

ఆ సందులోని పతివ్రతా శిరోమణుల్లాగానే వుంది సుశీల, ఓ ఇరుకు దర్వాజాలో ఇరుగ్గా నిలబడి.

"సుశీలా" చకచకా మెట్లెక్కి సుశీల ముందర నిలబడి అంది జానకి.

ఒక్క క్షణం అదిరి పడింది సుశీల.

"జానకీ.... నువ్వు" క్షణం తెల్లబోయింది సుశీల.

"నువ్వు.... నువ్వు... ఇక్కడి కేలా వచ్చావ్" ఆశ్చర్యంగా అడిగింది సుశీల తళ తళ మెరుస్తున్న జానకి నెక్లస్ వేపు పరకాయించి చూస్తూ.

"చిన్న పనుండి వచ్చాకానీ ... అబ్బ నిన్ను చూస్తూంటే ఇద్దరం కలిసి చేసిన గొడవ కాలేజీలో అంతా గుర్తుకు వస్తోంది. బి.ఎ. పాస్ అయ్యావా?" ఎన్నాళ్ళ తరువాత కలవడం వలన చక చకా ప్రశ్నలు అడుగుతుంది జానకి.

"ఆ పాస్ అయ్యాను" నిర్జీవంగా సమాధానం ఇచ్చింది సుశీల గోడగా వున్న

ర ... చూస్తూ.

"అదేమిటే ఎక్కడా ఇల్లు లేనట్టు ఇక్కడ ఉంటున్నావ్? మా ఇంటి దగ్గర మంచి రూమ్ చూస్తాను వచ్చేయ్ అసలు నీకు బుద్ధి లేదు ఎలా వుంటున్నావో ఏమో" అంది జానకి.

"ఎందరో వుంటున్నారిక్కడ"

"అంటే"

"ఇక్కడ వున్న వాళ్ళందరూ ఏవిధంగా లైఫ్ ఎంజాయ్ చేస్తారో అలాగే ఎంజాయ్ చేస్తున్నాను"

అర్థమయింది జానకికి.

చిన్నగా నవ్వింది సుశీల.

"ఛీ .. సిగ్గు లేదూ. ఇలాంటి పని చెయ్యటానికి ప్రాణం పోయినా శీలం పోకూడదని చెప్పేదానివి. సిగ్గు లేదూ? మానం ప్రాణం కన్నా ఎక్కువనే విషయం తెలియదా? నీ మొహం చూడాలంటేనే బాధగా వుంది అడుక్కుతినే వాడికున్న గౌరవం నీకు లేదు" నేలమీద కోపంగా వుమ్మేసింది జానకి

సుశీల మాట్లాడలేదు

"ఛీ! సు...శీలట సుశీల. ఆ పేరు పరువు తీశావు సుబ్బరంగా ఎండ్రిన్ తాగి చావకపోయావా?" కోపంగా అంది జానకి.

"నేను ఇలాగే అనుకున్నాను మొదట. ఒక కిరాతకుడికి బలయిన నేను చెయ్యగలిగింది ఇంతే" దోసిట్లో ముఖం దాచుకుని లోపల వున్న రెండో గదిలోకి పరిగెత్తింది సుశీల

సుశీల వెళ్ళినవేపు రెండు నిముషాలు చూసింది జానకి.

తరువాత నెమ్మదిగా ఆ సందు వదలి రోడ్డు చివరకి నడిచింది జానకి.

* * *

అక్కడ వున్న కిళ్ళీకొట్టువాడు జానకిని చూసి చిన్నగా నవ్వాడు. "ఏటి జానకమ్మగోరూ! మీ ఇంటికాడకి పాసెంజర్లు రాటం లేదేంటి? ఇంతకాలంలో మాకాడకు" అనడిగాడు.

జానకి జవాబివ్వకుండా అక్కడి నుంచి జారుకుంది.

★

# స్వయంకృతం

(నాల్గవ పేజీ తరువాయి)

న్నారు రావుగారి ఖంగారు చెప్పనక్కరలేదు

"చూడండి రావుగారూ మీరిలా సరిగా ఖంగారుపడి వచ్చారు ఖంగారు పెట్టకండి పది నిముషాలలో అంతా నార్మల్ అయిపోతుంది. అని విసుక్కొన్నారు

"వాడే నా ప్రపంచం ... అన్నీ వాడే డాక్టర్" రావుగారు గొణుక్కొన్నారు

"రావుగారూ! ఈ మందులు తెప్పించండి" డాక్టరు ఏదో చీటి యిచ్చారు

రావుగారు వెంటనే డ్రైవరును పిలిచి మందులు తెప్పించారు

బాబుకి మందులు వాడారు. ఏమి ప్రయోజనం కనపడటం లేదు డాక్టరకు చెమటలు పడుతున్నాయి. మళ్ళీ అవే మందులు యింజక్షనులూ వాడారు. ప్రయోజనం లేకపోయింది. డాక్టర్లు ఓడిపోయారు

"ఇందుకేనా డాక్టర్ బాబుని ఏం కష్టపెట్టించింది!" తలబాదుకొంటూ రోదిస్తున్నారు రావుగారు

"సారీసార్! ఈ మందులు వెంటనే గుణమిస్తాయి మరి ఎందుకు యిలా జరిగిందో తెలియదు" మందులను పరీక్షగా చూస్తూ డాక్టరు సమాధానం.

"ఏం మందులవి" అంటూ రావుగారు వాటిని డాక్టరు దగ్గరనుంచి తీసుకొన్నారు.

అంతే ఆయనకి ప్రపంచం అంతా తిరుగుతున్నట్లయింది. అవి, తన ఫ్యాక్టరీలో తయారయిన కల్తీ మందులు. అనుకుంటూ కుప్పలా కూలిపోయారు రావుగారు.

★